కొద్ది క్షణాలు అక్కడ గడిపేను. మళ్ళీ ముందుకు కదిలేను. కొంత దూరం నడిచేను. అలసటగా వుంది. చెట్టుకింద ఆగేను. ఎదురుగా గురవయ్య శెట్టి షాపుంది. రెండు దశాబ్దాల కిందట చిన్న కిరాణా దుకాణం పెట్టేడు. ఇప్పుడతడు చాలా పెద్ద వ్యాపారస్తుడు. పల్లెల్లో అప్పులిచ్చి పంటలు తక్కువ ధరలకు కొంటాడు. తక్కువ ధర దినుసులూ, ఎక్కువ ధర దినుసులూ, అలాగే పాతవి, కొత్తవి కలుపుతూ ఎక్కువ ధరకు అమ్ముతాడు. అంతేగాక తూకం తక్కువ చేసి అమ్ముతాడు. బంగారం తాకట్టు మీద అప్పులు కూడా యిస్తూ వుంటాడు. ఈ రకంగా అతడు దోచుకుంటున్నాడు. ఈ చేత్తో ఎందర్నో ఆఫీసర్లను లక్షాధికార్లను చేశానని గొప్పగా చెప్పుకుంటూ వుంటాడు. అతడి పిల్లలు ఆడుకుంటూ తిట్టుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. ఆ మాటలు విన్న ఆ ఇల్లాలు వాళ్ళ మీద మండిపడుతోంది. అలసట తగ్గింది. చెట్టుకింద నుంచి కదిలేను. నెమ్మదిగా నడుస్తున్నాను.

ఇసుక లారీ జోరుగా దూసుకువచ్చేస్తోంది. ఎండ మండిపోతోంది. ఇసుక కాలిపోతోంది. కూలీలు ఎండలో మాడిపోతూ ఇసుకలో కాలిపోతున్నారు. తలలు పైకెత్తితే చెట్ల కొమ్మలు తగిలి తలలు తెగిపోతాయనే భయంతో ఇసుకమీద వాలిపోతున్నారు. గబగబా పక్కకు తప్పుకున్నాను. రాయి తగిలి చెప్పుతాడు తెగిపోయింది. కొద్ది అడుగుల దూరంలో వయస్సు మళ్ళిన వేపచెట్టువుంది. ఆ చెట్టు కింద వయస్సు మళ్ళిన కన్నయ్య చెప్పులు కుడుతూ వుంటాడు. చెప్పులు చేత్తో పట్టుకుని అక్కడికి నడుస్తున్నాను.

కన్నయ్య జీవితం కళ్ళముందు కదుల్తోంది. నలభై ఏళ్ళ నుంచి కన్నయ్యను అక్కడే చూస్తున్నాను. అలాగే వున్నాడు. కన్నీళ్ళతో, చెమటతో కాలం గడుపుతున్నాడు. అర్ధాకలితో అలాగే జీవిస్తున్నాడు. కొద్దిగా భూమి వుండేదట. చిన్న రైతుల భూములను చాపగా చుట్టేసి చంకన బెట్టేసుకునే సత్యనారాయణ చౌదరి ఈ కన్నయ్య భూమిని కూడా చాపలో చుట్టేశాడట. ఊళ్ళో కూలి పని కూడా దొరక్క ఇక్కడికి వచ్చేశాడు. భార్య ఆకలితో, జబ్బుతో చనిపోయింది. ఆమె చెల్లెల్నే మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు! ఆమెకు ఆరేళ్ళ కొడుకున్నాడు. అతడి పెద్ద కొడుకూ, అల్లుడూ రిక్షాలాగుతూ జీవిస్తున్నారు. కన్నయ్య రెండో భార్య అతనికి పనిలో సాయం చేస్తూ వుంటుంది.

'చెప్పుతాడు తెగిపోయింది కన్నయ్యా' అన్నాను.

'ఏ తాడైనా ఎంతకాలం తెగకుండా వుంటాది! ఆడితల్లి పోగానే కొడుకు నాతో తాడు తెంపేసుకొని ఎల్లిపోనాడు! కూతురికి కోకగుడ్డ కూడా కొన్నేకపోతన్నానని అల్లుడు నాతో తాడు తెంపేసుగొన్నాడు. నేను బేగి ఎల్లిపోవాలని, ఈ గుంటతాడు బేగి తెగిపోవాలని బెగమంతుణ్ణి మొక్కుతున్నాను!'

'అలా అనకు...!'

'నీనాగ గూకుని తిండానికి నాకు కుదర్దు కదా! పని సేయనేక పోతన్నాను, ఏల్లు వంగడంనేదు! నెగటంనేదు! ఎలగ సెయ్యాల! ఏటి సెయ్యాల! సెయ్యకుండ దినమెలగ గడుత్తది!'

ఏదో మాట్లాడుదామనుకున్నాను. ఇంతలో కుర్రాడు పావలా కావాలని అల్లరి చేస్తున్నాడు. ఆమె చెప్పిచెప్పి విసిగిపోయింది. 'ఇయ్యాల టీ డబ్బులు కూడా రానేదు! సెట్టుందేటి, దులిపితే రాల్డానికి! ఈ రెండూ ఒట్టుకెల్లు!' అని కుర్రాడి రెండు చెంపలూ వాయించేసింది. వాడు ఏడ్చుకుంటూ వెళ్ళిపోయాడు. చెప్పులు వేసుకొని ముందుకు నడుస్తున్నాను. అలసటగా వుంది. చింతచెట్టు కింద ఆగాను. అదే చింత చెట్టో చెప్పనా? అరిసిగాడు నలభై ఏళ్ళనుంచి ఆ చెట్టుకిందే అరటిపళ్ళు అమ్ముకుంటున్నాడు. దానిని మాల చింతచెట్టని వాళ్ళూ వీళ్ళూ అంటుంటారు. చెట్లకి కూడా కులాలే! అతడి భార్య పోలితల్లి వీధివీధికీ, యింటింటికీ చెప్పులు కూడా లేకుండా ఎండలో తిరుగుతూ, గొంతుక ఎండిపోయేలా కేకలేస్తూ పళ్లు అమ్ముతూ వుంటుంది. ఎండిపోయిన ఆమె గొంతుక కేక అలాగే ఇవాళ కూడా నలభై ఏళ్లనాటి కేకలా ప్రతి వీధిలో, ప్రతి ఇంట్లో వినబడుతోంది. అలసట తగ్గి నెమ్మదిగా అడుగులు వేస్తూ ముందుకు నడుస్తున్నాను.

ఇటుకల లారీ జోరుగా వచ్చేస్తోంది. బుర్రమీద గుడ్డలు కప్పుకుని కూలీలు కాలుతున్న ఇటుకల మీద కాలిపోతున్నారు. లారీ జోరుకు నేలమీద మట్టి రేగిపోయి గాలిలో ఎగురుతోంది. దూరంగా తప్పుకున్నాను. సూర్యభవనం ముందు నిలబడ్డాను. ఐదు అంతస్తుల విశాలమైన భవనమది. దాని యజమానిని చౌదరి అని కొందరు పిలుస్తారు. రుద్రయ్య చౌదరని కొందరంటారు. అతణ్ణి ఎవరూ ఎలా పలిచినా ఒక్కమాట మాత్రం ఒకేలా అందరూ చెబుతారు. చిన్న రైతుల భూములను చాపగా చుట్టేసిన సత్యనారాయణచౌదరికి ఇతడేమీ తీసిపోడని మాత్రం అందరూ అంటారు.

అయితే ఆ కుటుంబానికి అనుకోని కష్టమొకటి వచ్చి పడింది. రుద్రయ్య మూడో కొడుకు రాజేంద్ర ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అతడు క్రికెట్ బాగా ఆడగలడు. అతడికి చంద్రమాదిగతో ప్రాణ స్నేహం ఏర్పడింది. ఆ స్నేహాన్ని పురస్కరించుకొని చంద్రాన్ని రాజేంద్ర తరచూ తన యింటికి తీసుకువస్తూ వుంటాడు. ఆరోజు కూడా చంద్ర మామూలుగా రాజేంద్రకోసం వచ్చాడు. మెట్లెక్కుతున్న చంద్రానికి యింట్లోనుంచి ఏవో మాటలు వినబడి ఆగిపోయాడు.

'నా మాట వినరా. మన అంతస్తుకి తగినవాళ్ళతో నువ్వు స్నేహం చేయాలి. మన కులపోడితో స్నేహం చేయాలి. నేను ఎన్ని విధాల చెప్పినా నువ్వు చంద్ర స్నేహం మానుకోవు గదా! నువ్వు ఈ యింట చెడబుట్టావు. వాడు మళ్ళీ మనింటికొచ్చాడంటే నేను బావిలో దూకి చస్తాను. లేదంటే ఈ డాబా మీది నుంచి దూకేస్తాను' అంటూ రాజేంద్ర తల్లి ఏడుస్తూ బెదిరిస్తోంది. ఆ మాటలు విన్న చంద్ర వెంటనే వెనుదిరిగాడు. రాజేంద్ర అది చూశాడు. పరుగున వచ్చి అతణ్ణి అడ్డుకున్నాడు. రెండు చేతులూ పట్టుకొని పార్కులోకి లాక్కుపోయి పచ్చగడ్డి మీద కూర్చోబెట్టాడు. నేను కూడా జోరుజోరుగా పార్కు చేరుకొని ఒక రాతిమీద కూర్చున్నాను.

'ఈ రోజు ఆర్థిక ఆధిపత్యవర్గాలే రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఆధిపత్యాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. నేటికీ కుల, మత, ఆర్థిక వివక్షలు కొనసాగడం దురదృష్టకరం. ఈ వివక్షకు వ్యతిరేకంగా మేమంతా సమైక్యంగా పోరాడక తప్పదు' అంటూ చంద్ర ప్రభంజనంలా వెళ్లిపోయాడు.

★ ★ ★

సూర్యుడు ఎప్పుడూ మండుతూనే వుంటాడు!

ప్రజాపోరాటాలు మండే సూర్యుని వంటివి!!

★ ★ ★

(ప్రజాశక్తి - దినపత్రిక - ఆదివారం - 10.06.2001)

# జీవించడం తెలీని మనిషి!

సమాజం మనిషిని నిర్మిస్తుంది. సమాజమే నవ్యనీ నిర్మించింది. అయితే నవ్య ఒక ప్రశ్నలా కనిపిస్తోంది. ఆ సందర్భంగా మా నాన్నగారి మాటలు గుర్తు తెచ్చుకుంటున్నాను.

'మనిషి సృష్టిస్తాడు. సృష్టిస్తున్నాడు. ఎన్నెన్నో నేర్చుకుంటూ నేర్పుతున్నాడు. ఒకటి మాత్రం నేర్చుకోలేకపోతున్నాడు. జీవనకళ నేర్చుకోలేకపోతున్నాడు. జీవించడం తెలీని మనిషిగా జీవిస్తున్నాడు' - ఇవీ ఆయన మాటలు!

★ ★ ★

సామాజిక అభద్రతలో పలువిధాల సామాజిక మనస్తత్వాలు ఏర్పడుతాయి.

ప్రజలు భయపీడితులుగా జీవిస్తారు. డబ్బు మాత్రమే భద్రత ఇవ్వగలదని డబ్బుకోసం కొందరు జీవన విలువలను త్యాగం చేసేసి, అవినీతి పరులుగా, దోపిడీదారులుగా, దొంగలుగా, నేరస్తులుగా జీవిస్తారు. కొందరు వ్యసనపరులుగా జీవిస్తూ భయం నుంచి తాత్కాలిక ఉపశమనం పొందుతారు. జీవనవిలువలను పూర్తిగా త్యాగం చేయలేని వారూ - అక్రమ మార్గాల్లో ధనార్జన చేయలేనివారు - ఆ విధంగా చాలా ఎక్కువ మంది ప్రజలు నిస్సహాయులుగా జీవిస్తారు.

ఆ విధంగా - పలు విధాల సామాజిక మనస్తత్వాలు - మానవ జీవనాన్ని నడిపే సామాజిక జీవన తత్వాలు - ఏర్పడతాయి. అటువంటి జీవన తత్వాల ప్రభావం వల్ల ఏ జీవన శైలికి ఆకర్షితులై లొంగిపోతూ ఎక్కువ మంది ప్రజలు జీవిస్తారో, ఆ జీవన శైలిలోకి ప్రజా జీవనం కొట్టుకుపోతుంది. ప్రజలు దాన్ని అడ్డుకోకపోతే, అది జీవన విధ్వంసాన్ని సృష్టిస్తుంది!

నవ్య జీవితంలో అదే జరిగింది.

★ ★ ★

అటువంటి మాటలు మా నాన్నగారు ఎప్పటికప్పుడు మాకే కాకుండా తెలిసిన వారందరికీ చెబుతూ వుండేవారు. ఆయన మాటలు వినడానికి కూడా ఆయన చుట్టూ ఎప్పుడూ ఎందరో చేరుతూ వుండేవారు. ఆయన మాటలను ఇప్పుడు నేను గుర్తుకు తెచ్చుకుంటున్నాను! ఎందుకోసం?!

నేనూ, నవ్యా పది సంవత్సరాల నుంచి జీవితాన్ని కలసి పంచుకుంటున్నాం. మా కుటుంబంలోకి వచ్చాక నవ్య మొదట్లో - మా అమ్మను అడిగి అన్నీ మా అమ్మ చెప్పినట్లే చేస్తూ వస్తోంది.

ఒకరోజున మమ్మల్ని పిలిచి మా నాన్నగారు చిన్న ఉపన్యాసం ఇచ్చేరు.

'మీ జీవితాన్ని మీకు కావలసినట్టు చేసుకోండి. మా అనుభవంలో మీకు ఏదైనా మంచి కనిపిస్తే, దాన్ని మీరు మీ అనుభవంలోకి మార్చుకోండి. అటుపైన ప్రతి విషయం మీ ఇద్దరూ కలిసి ఆలోచించుకుని చేసుకుంటూ వుండండి. మేమింక కుటుంబ విషయాలకు దూరంగా వుంటాం. స్వేచ్ఛగా మాకు నచ్చినట్టు మా శేష జీవితాన్ని గడపాలనుకుంటున్నాం. మనిషికి మూడు బాధ్యతలుంటాయి. మొదటి రెండు బాధ్యతలూ తనకీ, తన కుటుంబానికీ సంబంధించినవి. అవి మా శక్తి మేరకు మేం చేసేసాం. మూడో బాధ్యత తోటి మనుషులకూ - సమాజానికి సంబంధించింది. అందులో ప్రజలకూ - సమాజానికి - ప్రయోజనకరంగా విధినిర్వహణ ముఖ్యమైంది. అది కూడా మా శక్తి మేరకు పూర్తిచేసేసాం. అయినా - మిగిలిపోయింది చాలా వుంది. కష్టిస్తూ, శ్రమిస్తూ, దోపిడీకి గురవుతూ పేదరికంలో జీవిస్తున్న పేదవారి పిల్లలకు ఉచితంగా చదువు చెప్పాలనుకుంటున్నాం. వారికి పరిశుభ్ర జీవనం నేర్పాలనుకుంటున్నాం. మనం కూడా పేదవారమే. డబ్బు ఖర్చు పెట్టలేం. అయితే వాటిని మనం శ్రమించి చేయగలం. మీరొకటి అడుగుతారు. అది మాకు తెలుసు. ఆధ్యాత్మిక జ్ఞానంతో - భగవత్ జ్ఞానంతో - భగవత్ సేవలో - మీ శేష జీవితాన్ని ఎందుకు గడపకూడదు? అటువంటి ప్రశ్న అడుగుతారు. అది మాకు తెలుసు!

భగవత్ జ్ఞానం - భగవత్ సేవ - ఎందుకు? మనిషిని మానవ సేవలోకి మళ్ళించడానికి సహకరించేదిగా, సహకరించేందుకు - అటువంటి జ్ఞానం ఆవిర్భవించింది. అయితే ఆ జ్ఞానం దగ్గరే మనిషి ఆగిపోతున్నాడు! మానవ సేవలోకి వెళ్లకుండానే ఆయువు కోల్పోతున్నాడు! అదంతా వ్యర్థమైపోతోంది! ఆవిధంగా ఎంతో మానవ శక్తి, మానవ మేధస్సు వ్యర్థమైపోతోంది! గమ్యాన్ని చేరుకోలేకపోతోంది! ఎందరో ఎందరో దైవజ్ఞానాన్ని వారి వారి స్వార్థాలకు వాడుకుంటున్నారు! శ్రమ జీవనం - సత్య జీవనం - సర్వ సమాన సహజీవనం - మాత్రమే మంచి జీవితాన్ని నిర్మించగలవు! మంచి సమాజాన్ని నిర్మించగలవు!'

ఆ విధంగా మా నాన్నగారు చెప్పేరు. నేనూ, నవ్యా ఒప్పుకున్నాం. మా అమ్మా, నాన్నా వారు ఎంచుకున్న మార్గంలో జీవిస్తున్నారు.

కొద్దిరోజులు పోయాక, నవ్యకు ఉద్యోగం వచ్చింది. నేనేమీ చెప్పకుండా మౌనంగా వుండిపోయాను. మా అమ్మా, నాన్నా కూడా జోక్యం చేసుకోలేదు. వారు కూడా మౌనంగా వుండిపోయారు. ఆరోజు రాత్రి మేమందరం కలసి భోం చేస్తున్నాం. నవ్య ఆ విషయం కదుపుతూ తన అభిప్రాయాన్ని చెప్పేసింది. 'నేను ఉద్యోగంలో చేరితే అత్తగారూ, మామగారూ వారు ఎంచుకున్న మార్గంలో జీవించలేరు. అంతేకాకుండా, అత్తగారిని గౌరవనీయమైన పనిమనిషిగా మామగారిని అత్యంత గౌరవనీయమైన సేవకుడిగా చేయడమే అవుతుంది! వారిమీద మళ్ళీ భారం పెట్టడమే అవుతుంది!' అని చెప్పేసింది. ఉద్యోగాన్ని తిరస్కరించింది.

ఆమె నిర్ణయాన్ని మేమందరం గౌరవించేం.

★ ★ ★

కాలం గాలిలా వెళ్ళిపోతోంది.

ఒకరోజున మా నాన్నగారికి కొద్దిగా గుండె నొప్పి వచ్చింది. డాక్టర్లు వచ్చేరు. చూసారు. మందులిచ్చేరు. విశ్రాంతి అవసరమని చెప్పేరు. నిజానికి ఆయన ఎప్పుడూ విశ్రాంతిగా, ప్రశాంతంగా వుంటారు. ఆరోజు కూడా చిరునవ్వు నవ్వుతూ ఉత్సాహంగా, ప్రశాంతగా వున్నారు.

అదొక చిన్న గది. ఆ గదిలో మా అమ్మానాన్నా విశ్రాంతి తీసుకుంటారు. మాది చాలా చిన్న ఇల్లు. రెండు చిన్న గదులూ, చిన్న వంటగదీ, నడవ మాత్రమే ఉన్నాయి. ఆగదిలో ఒక పట్టె మంచం మాత్రమే పడుతుంది. దాన్ని మా నాన్నగారు వాడుకుంటున్నారు. మా అమ్మ తుంగచాప వేసుకుని విశ్రాంతి తీసుకుంటుంది.

పాత గోడలు పెల్లలు ఊడిపోతూ గాయపడిన మనిషి హృదయంలా కనబడుతున్నాయి. అయితే – మా బతుకు అలావున్నా, మా జీవితంలో సుఖం – సంతోషం – శాంతి మాత్రం వుంటోంది. సంతోషంగా ప్రేమగా జీవిస్తున్నాం. మా నాన్నగారి దగ్గర అందరం కూర్చున్నాం. ఆయన చిరునవ్వు నవ్వుతూ నెమ్మదిగా చెప్తున్నారు. ఆయాసం ఆయన మాటల్ని అడ్డుకుంటోంది.